# వేసవి పగలు

ప్లీడరుగారి యింటిదగ్గర్నించి తిరిగొచ్చిన సీతయ్య కర్రపెట్టెని గబగబా తెరిచి, అందులో బట్టల్ని చిందరవందర గా విసిరేసి, అడుగున ఉన్న చిన్న తాటాకు పెట్టెని తీశాడు. కూతురు రామి దీపంబుడ్డి పట్టుకుని నుంచుని, అంతా అర్థం కాకుండా చూస్తోంది

తాటాకు పెట్టెలో చిల్లరంతా లెక్కపెడితే ఆరు రూపాయలు తేలింది.

''ఇప్పుడెందుకు ఆ డబ్బు?''

కూతురడిగింది. రూపాయలవైపు శూన్య దృష్టుల్ని ప్రసరిస్తున్న సీతయ్యకి ఆ ప్రశ్న బాహ్య ప్రపంచపు స్ఫురణ కలిగించింది.

''ఎందుకా? ఆయనకి కిందటి నెల బాకీ బాపతు డబ్బు తక్షణం యివ్వాలిట! లేకపోతే రేపట్నించి రిక్షా కిరాయి కిచ్చేది లేదన్నాడు.''

బుడ్డికింద పెట్టి రామి పక్కగా కూచుంది.

''పోనీ వేసవికాలం వెళ్ళాక తీర్చుకుంటామని చెప్పకూడదు?''

"అంతా అయింది. కాని అ మహానుభావుడు వినేలా లేడు. అందుకే అరగంటసేపు ఏకధాటిగా లెక్చరుకొట్టింది; నన్ను పిలిపించిందీని".

సీతయ్య చేతులకండల్ని చూసుకోసాగాడు, అవి కష్టం

లో కరిగిపోయామో, గట్టి పడ్డామోనని.

"పోసీ సగమిచ్చెయ్యి. తలమీదికి గుడ్డా కాళ్ళకి చెప్పులూ లేకపోతే ఎండలో ఎట్లా బాధపడ్తావ్?"

ఆలోచన బాగానే వుంది. కాని సీతయ్య ప్రయత్నా లన్నీ నీళ్ళు కారాకనే, యింటికి వచ్చాడు.

"ఏదో పిచ్చిగాని, నేను ఆ ప్రియత్నం చెయ్య లేదను కున్నావా, అమ్మాయ్? కాని ఆ బ్రాహ్మడు అంగీకరిస్తేగా! ముందు ఆ బాకీ అక్కడపెట్టి, రేపు రిక్షామీద చెయ్యివెయ్యి అన్నాడు."

"మరి తలగుడ్డా, జోళ్ళ మాట?"

"ఆ సంగతి నే చూస్తాన్లే!"

బట్టలు మళ్ళీసర్ది, డబ్బు సంచిలో పెట్టుకుని, బయలు దేరాడు, సీతయ్య.

రామి మాత్రిం నిస్సహాయత తెలియజేస్తున్న చూపు లతో అతన్ని సాగనంపింది.

దారిలో సీతయ్య అనుకున్నాడు:

"వీళ్ళకి కృతజ్ఞత వుండదు. మనుషుల్ని నమ్మలేరు, అసలు వాళ్లమీద వాళ్ళకే నమ్మకం తక్కువ. ఇంక యితరు ల్నెలా నమ్ముతారు? నేను కష్టాన్నైనా సహిస్తానుగాని, మాట పడలేను."

## 2

వేసవికాలం! అప్పుడే రోహిణీకార్తి ప్రివేశించింది.

సుకుమార శరీరులైన ధనికులుకూడా మహా కష్టపడు తున్నట్లు చెమటల్ని గక్కుతున్నారు.

కానీ యిళ్ళల్లో వాళ్ళకి తగినసదుపాయాలు లేకపోలేదు. ఎలక్ట్రిక్ ఫాన్లూ, వొట్టివేళ్ళ తెరలూ, ఇంటిలోకి ఎండని రానియ్యకుండా తరుము తున్నాయి. ప్రపంచమంతా అంత చల్లగానూ ఉన్నట్టు అనుకుంటున్నారు. పదింటికీ, పన్నెం డింటికీ, మూడింటికీ వచ్చి నీళ్ళతో కుర్రాడు వట్టివేళ్ల తెరల్ని తడపకుండావుండడు. ఇది అదృష్ట జీవుల సంగతి మాత్రమే!

కాని కోట్లాది దురదృష్ట జీవులు లోకంలో లేకపోలేదు. ఎండవానల్ని భరించమని దేవుడు సృష్టించాడు వాళ్లని. అదే అతడి వుద్యోగం. కాని యింత కష్టపడ్డా మా మూలు రోజుల్లో ప్రతిఫలం కంటె ఒక అణా అధికమివ్వడానికి, ఆ అదృష్ట జీవులు గుడ్లు మిటకరిస్తాయి. పర్సులమీదికి చేతుల్ని పోనివ్వవు.

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. పొద్దున్న నించి ఏదో కష్టపడి రిక్షా లాగాడుగాని యింక దాన్ని ముట్టు కోడం కష్టమనిపించింది సీతయ్యకి. కాని ఎంతగా ఎండకి అలవాటు పరుద్దామనుకున్నా, మొద్దుబారుద్దామనుకున్నా, ఇంకా ఎండ ఆ మోటుతనాన్ని చీల్చుకుని మంట పెడుతోంది.

సూర్యరశ్మి తల్లోకి చొచ్చుకుపోయి మెదడును కరిగి స్తున్నట్టుంది. వొళ్ళూ, కట్టుకున్న చిన్నిగుడ్డాకూడా చెమటతో తడిసిపోతున్నాయి. ఎంతగా చెమటని తుడుచున్నా మళ్ళీ, అంతంలేని ప్రవాహంలా అది పైకి వుబికి వస్తోంది.

అప్పుడే స్టేషనునించి ఒక సవారీని ఇంటి దగ్గర దిగ బెట్టిన సీతయ్య ఒక్కసారిగా ఏదో పెద్ద ఒగర్పునీ, ఆయాసా న్నీ పొందాడు. తలలో శూలాల్తో పొడుస్తున్నట్టు పోటు

కలగసాగింది. గుండె వేగంకూడా అధికమైనట్టను కున్నాడు. ఎదట చూస్తున్న వస్తువులు ఏవో నీటిలో వస్తువుల్లా వంకర టింకరగా వున్నట్టు కనపడ సాగాయి. చేతులు రిక్షాగంటని అనవసరంగా, అనాలోచితంగా ఒకసారి వాయించాయి.

పక్కనే వున్న మర్రిచెట్టుకిందికి కాలుతున్న కాళ్ళు అనుకోకండానే పోయాయి. రోడ్డుకి పక్కగా రిక్షాని నిలిపి, చెట్టు దగ్గర కూచున్నాడు, ఒక నిమిషం విశ్రాంతికని. ప్రాణం లేని రిక్షా కూడా సానుభూతి పూర్వకమైన విచారాన్ని తెలుపుతున్నట్టనిపించింది, అతనికి.

'ఒక్క నిమిషం నువ్వు కూడా విశ్రాంతి తీసుకో. ఎండలో నీ టైర్లు కరుగుతున్నాయి కూడాను' అన్నాడు.

అప్పుడే వీచిన గాడ్పు గాలి చెట్టుకింద కొంచెం చల్ల బడి అతని ఆవలింతలో మిళితమై పోయింది. అతని ఆయా సం కూడా కొంత తగ్గ సాగింది. నషం దానంతటదే చెట్టుకి జారగిల బడింది. ఎండవేడికి ఎర్రబడ్డ కళ్ళు రెప్పల వెన కాల దాగుతున్నాయి.

ఒక్కనిమిషంలో అతన్ని గాఢమైన నిద్ర ఆక్రమించు కుంది. మర్నాటి తిండి సంగతీ, యజమాని కివ్వాల్సిన అద్దె సంగతీ ఏమీ అతన్ని బాధించేవిగా లేవు.

అల్లా ఎంతసేపు నిద్రపోయాడో అతనికే తెలియదు.

3

బాగా చీకటి పడింది. నాన్నకోసం ఎదురు చూసిన రాము కంగారు పడసాగింది మధ్యాహ్నం గంజికి కూడా రాలేదేమా అనుకుంది.

వెతుక్కుంటూ, వెతుక్కుంటూ చివరికి ఈ చెట్టు నీడని చేరుకుంది.

తండ్రి ఇంకా వొళ్ళు తెలియని నిద్రలోనే వున్నాడు. తన జన్మలో జ్ఞానం వచ్చాక నిద్దర పోవడం, అంత సంతుష్టికరంగా, అతనికి అదే మొదటిసారిగావును.

రోడ్డు పక్కగా వున్న రిక్షా చక్రం రోడ్డుపై విరిగి పడివుంది. రామికి కంగారెత్తింది.

ఏం జరిగింది? తండ్రేమయ్యాడు? ఏ ప్రమాదం రాలేదు కదా, కొంపతీసి?

ఎన్నో చెడ్డ ఆలోచనలు, లెక్కలేనన్ని తలలో ప్రవేశించాయి.

కాని తండ్రి పడుతున్న గురక కొంచెం కంగారును పారద్రోలింది. కాని విరిగిన రిక్షా ఆతాన్ని అధికం చేస్తోనే వుంది.

"లే, నాన్నా, ఇక్కడ నిద్దరేమిటి? ఈ రిక్షా ఇలా అయిందేమిటి?"

తట్టి లేపసాగింది.

సీతయ్య కళ్ళు తెరచాడు ఒక నిమిషం ప్రపంచాన్నంతా కలియ జూశాడు, ఎదో ఏ లోకంలోనించో అప్పుడే దిగినవాడిలా. తర్వాత అన్నాడు:

"ఎవరూ...? నువ్వా!!" లేచి నుంచున్నాడు. రామి మళ్లీ అంది.

"ఈ నిద్దరేమిటి? ఈ రిక్షాకేమిటి ఇలా అయింది.'

సీతయ్యకి అంతా అర్థమయింది.

తను నిద్దర్లో వున్న సమయంలో ఏలారీ అయినా డీకొట్టి వుంటుంది. కాని అతనికి విచారం కలగలేదు.

"పోనిలే .. ఇంక ఎండలో రిక్షా లాగక్కర్లేదు. ఏ పల్లెటూరన్నా పోయి కూలిపని చేసుకుంటాను."

అమితమైన సంతోషంతో అన్నాడు!

కాని రామి యింకా అంటోంది:

"మరి అద్దెవాడిసంగతి? వాళ్లకిరిక్షా ఇయ్యవద్దు?" అని.

కాని సీతయ్యకి ఆ మాటలు వినిపించడం లేదు. ★

## "చరిత్ర పునరావృత్త మవదు!"

కేశవరావు ఎంత చెప్పినా వినలేదు. వినడు. కారణ మేమిటా అని ఎంత ఆలోచించినా తెగటం లేదు. పోనీ నేను నమ్మేదాంట్లో లోపాలేమైనా వున్నాయేమోనని తరిచి తరిచి చూసుకున్నాను. కాని అటువంటి దేమీ జరగలేదు.

నా దృఢమైన నమ్మకం ఏమిటంటే– చరిత్ర పునరావృతం కాదని. నేను చదివిన సిద్ధాంతాలు దాన్ని బలపర్చేవి.

"చాలా మంది చరిత్ర ఏదో వృత్తంలోపలే తిరుగుతుందనుకుంటారు. పాత రోజులు మళ్ళీ వొస్తాయని నమ్ముతారు. కాని అది అబద్ధం. చరిత్ర పునరావృత మవదు. ఒక స్పైరల్‌లోవలె మెలికలు తిరిగి వున్నత పథాలకి చరిత్ర తగు గమనం సాగిస్తుంది" అనేది నా వాదన.

"కాదు. చరిత్ర పునరావృత మౌతుంది. మనం పాత రాతి యుగానికి ఏనాడో పోక తప్పదు" అని అతను మరింత